క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల జెడ్పీ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుడిపూడి రాంచందర్ ఉద్యోగ విరమణ పొందగా ఆయన్ను స్కూల్ ఆవరణలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం శాలువా కప్పి పూలబొకే అందజేసి సన్మానించారు. అనంతరం నర్సిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. రాంచందర్ విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి చేశారని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు గఫార్, శ్రీహరి, నాయకులు లక్కిరెడ్డి మహేందర్, ఉమ మహేశ్వర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీకి డిప్యుటేషన్

నల్లబెల్లి : జిల్లా కలెక్టర్ సత్యశారద దేవి ఆదేశాల మేరకు మండలంలోని నారక్కపేట హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తున్న మహేందర్‌ను వరంగల్‌లోని వీవీ ఎయిడెడ్ స్కూల్‌కు డిప్యుటేషన్‌పై పంపినట్టు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతన చెల్లింపు కోసం ఓడీ ప్రతిపాదికన పని చేస్తున్న పాఠశాల నుంచి సాధారణ నెలవారీ హాజరు ధృవీకరణ పత్రాన్ని నారక్కపేట హైస్కూల్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. వీవీ ఎయిడెడ్ స్కూల్‌కు వెంటనే రిలీవ్ చేయాలని నారక్కపేట హెచ్‌ఎంకు స్పష్టం చేశారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలపై కళాకారుల ప్రదర్శన

సంగెం : ప్రజాపాలన విజయోత్సవ యాత్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మండలంలోని నల్లబెల్లి, నార్లవాయి, నర్సాపూర్ గ్రామాల్లో శుక్రవారం కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆరు గ్యారంటీలు, ఇతర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జూపాక శివ, అంకం రామకృష్ణ, హింగే అరవింద్ కుమార్, రామకృష్ణ, రామచంద్ర భారతి, ఆనందం, శాలిని, అనిత, హరిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగ నిర్వహణకు ఏర్పాట్లు

సంగెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (శనివారం) మధ్యాహ్నం 2 గంటలకు రైతు పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఏఓ యాకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని రైతులు వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

రుణమాఫీపై హర్షం

ఖానాపురం : మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు పండుగ ఉత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు మాట్లాడారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రైతులకు ప్రభుత్వం బోనస్ సైతం అందించి అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, ముఖేష్, సాగర్‌రావు, వాసుదేవరెడ్డి, గంద్రాతి శ్రీను, బ్రహ్మచారి, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

సంగెం : మండలంలోని కేజీబీవీ ఎదుట ఉపాధ్యాయులు, ఉద్యోగులు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, కేజీబీవీ జిల్లా కన్వీనర్ రేణుక మాట్లాడారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నీలిమ, ఉపాధ్యాయులు శిరీష, యమున, సునీత, పద్మ, నాగరాణి, అనిత, చాందినీ, సాగరిక, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నల్లబెల్లి : కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడి తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలోని గుండ్లపహాడ్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు చింత బాబు (48) శుక్రవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడిపోయాడు. గాయాలపాలైన ఆయన్ను 108లో ఆస్పత్రికి తరలించారు.

ముందస్తు అరెస్ట్

వర్ధన్నపేట : హైదరాబాద్‌లో తలపెట్టిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నిరసనకు వెళ్లకుండా మండలానికి చెందిన బీజేపీ నాయకులు పెద్దూరి రాజ్‌కుమార్, తేజానాయక్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరును ఖండించారు.

బాబోయ్ కుక్కలు.. కోతులు

- బెంబేలెత్తుతున్న వృద్ధులు, చిన్నారులు
- నెలకు 150కిపైగా కేసుల నమోదు

చెన్నారావుపేట : మండల ప్రజలు బాబోయ్ కుక్కలు.. కోతులు అంటూ బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో నానాటికీ కోతుల, కుక్కల సంఖ్య పెరిగిపోతుండడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు రాత్రివేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. అన్ని కాలనీల్లో, వాడల్లో కోతులు, కుక్కల స్వైరవిహారం పరిపాటిగా మారింది. పాదచారులకు కుక్కలు, కోతులు పరుగు పెట్టిస్తూ ప్రమాదాల బారిన పడేస్తున్న పరిస్థితి నెలకొంది. వెంట పడి మరీ కరుస్తుండడంతో పలు గ్రామాల్లో యువత సైతం భయాందోళనకు గురవుతున్నారు. కోతులు ఇళ్లలోకి చేరి చిందర వందర చేస్తూ చేతికందిన వాటిని విసురుతూ బెదిరిస్తూ కరుస్తున్నాయి. తలుపులు పెట్టుకున్న ఇళ్లలోకి సైతం కోతులు చొరబడుతుండడం మహిళలను మరింత కలవర పెడుతోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి కుక్కల, కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామంలో తిరుగుతున్న కుక్కల గుంపు

రోజూ 6–10 కేసులు

మండలంలోని ఉప్పరపల్లి, లింగగిరి, కోనాపురం, జల్లి, చెన్నారావుపేట, ఎల్లాయగూడెం, పాపయ్యపేట, సూరిపల్లి, తదితర గ్రామాల నుంచి ప్రతిరోజూ 6–10 మందికిపైగా జనం కుక్క, కోతి కరిచిందంటూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుంటున్నారు. ప్రతినెలా మండలంలో సుమారు 150కిపైగా ఇలాంటి కేసులు నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రయాణించాలంటే భయమేస్తోంది



రోడ్డుపైన ప్రయాణించాలంటే భయమేస్తోంది. కుక్కలు గుంపులుగా వాహనాల మీదకు వస్తున్నాయి. కోతులు ఇళ్లల్లోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తూ అడ్డు వచ్చిన వారిని కరుస్తున్నాయి.

– శంకేసి ప్రమోద్, గ్రామస్తుడు, పాత ముగ్దుంపురం

తక్షణమే చికిత్స చేయించుకోవాలి



కుక్క, కోతి కరిస్తే తక్షణమే ప్రథమ చికిత్స చేసుకోవాలి. కరిచిన ప్రాంతాన్ని రన్నింగ్ ట్యాప్ వాటర్‌తో శుభ్రం చేసుకోవాలి. అనంతరం సబ్బుతో కడగాలి. కట్టుకట్టకుండా త్వరితగతిన ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలి. స్వల్ప గాయాలను కూడా నిర్లక్ష్యం చేయొద్దు.

– సరోజ, పీహెచ్‌సీ వైద్యురాలు

ప్రజలను మోసగించేందుకే దీక్షా దివస్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం : మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై వచ్చిన అవినీతిని కప్పి పుచ్చుకుని మరోసారి ప్రజలను మోసగించేందుకే బీఆర్‌ఎస్ నాయకులు దీక్షా దివస్ కార్యక్రమం చేపట్టారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు కేసీఆర్ ప్రజల సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని నిరాహార దీక్ష పేరుతో ఫ్లూయిడ్స్ దీక్ష చేశారని తెలిపారు. నాటి దొంగ దీక్షతో అనేక మంది విద్యార్థులు, యువకుల బలిదానాలకు కారకుడయ్యారని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, అధికార ప్రతినిధి జనగాం రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్య, నాయకులు మెట్టుపల్లి రమేష్, వీరమ్మ, రాధిక, జగన్నాథచారి తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత తప్పనిసరి



దుగ్గొండి : భోజనాన్ని రుచి చూస్తున్న సంగీతలక్ష్మి



వర్ధన్నపేట : హాజరును పరిశీలిస్తున్న తహసీల్దార్

దుగ్గొండి : మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి అని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వంట మొదలు పెట్టి పూర్తయ్యే వరకు ప్రత్యక్షంగా గమనించారు. బియ్యం, కూరగాయలు, పప్పులు, కోడి గుడ్లను పరిశీలించారు. స్వయంగా భోజనం చేశారు. విద్యార్థులు భోజనం చేశాక రుచి, శుభ్రతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కదారిగూడెంలో..

వర్ధన్నపేట : మండలంలోని కదారిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ స్కూళ్లను తహసీల్దార్ విజయసాగర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం హాజరు రిజిస్టరును పరిశీలించారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి



ఖానాపురం : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) అనురాధ కోరారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించి కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ధాన్యం విక్రయంలో అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. వరి పంటల కోత తర్వాత కొయ్యకాళ్లను కాల్చకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, ఏఈఓ రాజ్‌కుమార్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థుల ఎంపిక



నర్సంపేట రూరల్ : విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు



చెన్నారావుపేట : సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ శుక్రవారం అభినందించి మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌతం, పూర్ణిమ, ఓదెలు, ప్రీతి, రాజ్‌కుమార్, సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభారతి స్కూల్ విద్యార్థి ప్రతిభ

సంగెం : మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్ విద్యార్థి సాయితేజ ప్రదర్శించిన 'ప్లవింగ్ విత్ వీల్ ఇన్ అగ్రికల్చర్' ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. పంటచేలో కలుపు నియంత్రించే ఎగ్జిబిట్ ప్రదర్శించడంపై సాయితేజను, గైడ్ టీచర్ మధులితను ప్రిన్సిపాల్ పోశాల మధు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిద్ధార్థ హైస్కూల్ నుంచి..

చెన్నారావుపేట : మండలంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికవగా వారిని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అభినందించి మాట్లాడారు. విద్యార్థులు వెల్దండి శ్రీజ, సహజ, ముద్దునూరి మానస, దామెర విశృత్, పంతంగి శశాంక్ బహుమతులు సాధించారని తెలిపారు.

చెకుముకి పరీక్షలో..

జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలో చెందిన విద్యార్థులు తూర్పాటి యశ్వంత్, అక్కనపల్లి అనీష్, పంతంగి శశాంక్‌లు జిల్లాస్థాయిలో రెండో బహుమతి సాధించారు. విద్యార్థులను రని పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మేడి రమేశ్‌గౌడ్, గైడ్ టీచర్లు దామెర గణేశ్, మేకల విష్ణు, వల్ల వేణు, కందిక నవీన్, పరమేశ్వర్, తదితరులు అభినందించారు.

రామలింగేశ్వర ఆలయంలో దీపోత్సవం



దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

చెన్నారావుపేట : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ఉప్పరపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో కుంకుమ పూజ, దీపోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జన్నంపెల్లి సోమేశ్వర శర్మ, రంగనాథ స్వామి ధర్మాచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అర్చన, అభిషేకాలు, తదితర కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు, భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు

మండల కేంద్రంలోని ఆలయంలో సిద్ధేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సిద్ధేశ్వరుడికి అర్చకులు బీఎం.శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేశ్ శాస్త్రీలు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఖానాపురం : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సూచించారు. మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో ఎంఎల్‌సీ నిధులతో నిర్మించిన వంట గదులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హరిబాబు, ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు రవికుమార్, రామ్మోహన్‌రావు, మల్లయ్య, రమేశ్, గంగయ్య, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకురాలు సుధ



సమావేశంలో మాట్లాడుతున్న రాగసుధ

నర్సంపేట : ఉద్యమాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో కుక్కల యాకన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశానికి రాగసుధ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు నిర్మించాలని సూచించారు. భూస్వామ్య, పెట్టుబడిదారీ పాలకుల నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత శ్రేణుల మీదే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేసే వరకు ప్రజాపోరాటాలు నిర్మించాలని చెప్పారు. సమావేశంలో నాయకులు బెజ్జంకి రాజేశ్, పుట్టపాక సునీత, బండారి లావణ్య, ఈర్ల అనూశ, ప్రమీల, దేవమ్మ, సతీశ్, జ్యోతి, పుష్ప, రజిత, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న కిశోర్, తదితరులు

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లిలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని ప్రధాన అర్చకుడు త్రిపురారి కిశోర్ శర్మ, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ, అన్నవజ్జల రాంబాబు శర్మ వేదమంత్రాలతో శుక్రవారం పునఃప్రారంభించారు. సీతారామ లక్ష్మణ అంజనేయ సమేత పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూల విరాట్ అంజనేయస్వామి విగ్రహానికి పంచలోహంతో చేసిన తొడుగు అందచేశారు. ఈ సందర్భంగా కిశోర్ శర్మ మాట్లాడారు. గ్రామస్తులు విరాళాలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వాస్తు పూజ, మోగిని పూజ, చందన అలంకరణ హోమం, పూర్ణాహుతి, రంగనాథ ఆర్కెస్ట్రా బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విరాళాలు అందజేసిన దాతలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శివాలయ అర్చకుడు ఎస్‌పీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అభిషేక పూజలు



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకుడు తివారి ప్రణీత్ శుక్రవారం అభిషేక పూజలు నిర్వహించారు. అన్నదాతలు మల్యాల కిరణ్మయి వినయ్‌కుమార్, కదిరిపాక రమ్య శ్రావణ్‌కుమార్, మండల మమత గౌరీశంకర్‌రెడ్డి, జిగు మానస రమాకాంత్‌రెడ్డి, శింగిరికొండ భవానీ నవీన్‌కుమార్, హేమంత్ అభిషేక పూజలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, తోట భాస్కర్‌గుప్తా, భూపతి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో డ్రైవర్ల చేతివాటం

ఖానాపురం : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే క్రమంలో లారీ డ్రైవర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మండల వ్యాప్తంగా రెండు రోజులుగా ధాన్యం బస్తాలను లారీల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్లు లారీకి రూ.500–700 వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. డబ్బు ఇవ్వకపోతే సాకులు చెబుతూ ధాన్యాన్ని తరలించడం లేదని రైతులు వాపోయారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి డబ్బు వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో రైతులు గత్యంతరం లేక లారీ డ్రైవర్లకు డబ్బు ముట్టజెప్పి ధాన్యం తరలింపు కోసం ఎదురు చూస్తున్నట్టు కనపడుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి లారీ డ్రైవర్ల నుంచి ఒత్తిడి లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

జాతీయ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



నర్సంపేట : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



దుగ్గొండి : వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : ఏపీలోని విజయవాడలో డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న యూఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభల కరపత్రాలను పట్టణంలోని భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో పేదలను ఉన్నత విద్యకు దూరం చేసేలా కుట్ర చేస్తోందని విమర్శించారు. పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. అందరికీ సమాన విద్య అందేలా ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, విద్యారంగంలో వస్తున్న మార్పులపై చర్చించనున్నట్టు తెలిపారు. మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కళాశాల కమిటీ కన్వీనర్ జంపాల రమ్య, నాయకులు రాధిక, రజిత, సురేశ్, రవి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జన సభ వాల్‌పోస్టర్..

దుగ్గొండి : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని గిర్నిబావిలో మండల కన్వీనర్ కోడి కృష్ణాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం కృష్ణాకర్ మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టాలన్న ఆలోచనను మంద కృష్ణ విరమించుకోవాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ పెంపు కోసం పోరాడేందుకు కలిసి రావాలని సూచించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు ఈద విజేందర్, నాయకులు కూనమల్ల శ్రీనివాస్, బందెల సదానందం, రాజగౌరు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్య వర్ధంతి పోస్టర్..

రాయపర్తి : మండల కేంద్రంలో రేపు (ఆదివారం) నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి పోస్టర్‌ను ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముద్రబోయిన సుధాకర్, జంగి నరేశ్, పులుగుజ్జ ధినేశ్, బండారి శ్రీకాంత్, ముద్రబోయిన మహేశ్, ఊగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను ఢీకొట్టిన టిప్పర్

గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల పరిధిలోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ నుంచి మొరం తరలిస్తున్న టిప్పర్ శుక్రవారం రాత్రి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. అంబులెన్స్ నుంచి డ్రైవర్ బయటకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

టేకుల తండాలో చోరీ

ఖానాపురం : ఇంటి తాళం పగులగొట్టి చోరీ చేసిన ఘటన మండలంలోని టేకుల తండాలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం .. బోడ మంగ్య గురువారం భార్య భద్రమ్మతో కలసి నర్సంపేటలో కుమారుడి ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, 25 తులాల వెండి చోరీకి గురైనట్టు గుర్తించారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి వివరాలు సేకరించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న వెంకటరమణ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలకు వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ వన్నాల వెంకటరమణ రూ.30 వేల విలువైన 4 సీసీ కెమెరాలు శుక్రవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్ వజ్రోత్సవాలను పురస్కరించుకుని కెమెరాలు అందించినట్టు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎద్దు సత్యనారాయణ, రాయపురపు కుమారస్వామి, పెంచికాల కుమారస్వామి, పోశాల వెంకన్న, యాకయ్య, గుంటి కుమారస్వామి, పెద్దిరెడ్డి, ప్రేమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలి

ఖానాపురం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరగాలని జిల్లా మాత, శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతినెలా గర్భిణుల నమోదు, బాలింతల సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు కుష్ఠు నిర్మూలన సర్వేపై సిబ్బందికి డాక్టర్ అరుణ్ సూచనలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజయ్య, దామోదర్‌రెడ్డి, దేవిక పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ సర్వే

సంగెం : పోలీసు బందోబస్తు నడుమ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అలైన్‌మెంట్ సర్వే శుక్రవారం జరిగింది. గీసుకొండ మండలంలోని ఊకల్‌లో సర్వే పూర్తి అయ్యాక సంగెం మండలంలోని చింతలపల్లి పరిధిలోని కృష్ణానగర్‌కు సర్వే బృందం చేరుకోగా తొలుత కొందరు రైతులు అడ్డుకున్నారు. పోలీసులు చేరుకుని నచ్చచెప్పడంతో శాంతించడంతో సర్వే కొనసాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, సీఐ రాజగోపాల్, సంగెం, మామునూర్ ఎస్సైలు నరేశ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీ హైస్కూల్‌లో సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేశారు. హింసకు గురైతే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు.

విద్యార్థులకు బ్లాంకెట్లు, బెడ్‌షీట్ల అందజేత

పర్వతగిరి : రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో వెనిశెట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం కొండూరు శివప్రసాద్ సహకారంతో మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న 150 మంది విద్యార్థినులకు శనివారం బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయపు లింగారెడ్డి, క్లబ్ వరంగల్ సెక్రెటరీ వేణుగోపాల్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, క్లబ్ పూర్వ అధ్యక్షుడు దీకొండ నర్సింహారావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ కొండూరు శివప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ శ్రీకాంత్, రమేశ్, వెనిశెట్టి నళిని నారాయణ, సీసీఓ గారె జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.